క్లుప్తంగా

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు

బిక్కవోలు: మండలంలో బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శనివారం నిర్వహించిన సోషల్ పరీక్షకు బిక్కవోలు కేంద్రంలో ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని చెప్పారు. ఈ నెల 18తో పదోతరగతి పరీక్షలు పూర్తవుతాయన్నారు.

రంగంపేట: మండలంలో పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 568 మందికి గాను 565 మంది విద్యార్థులు రాశారని, ముగ్గురు గైర్హాజరయ్యారని చెప్పారు.

725 మందికి వైద్యసేవలు

సీతానగరం: రాపాక గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 725 మందికి వైద్య సేవలు అందించినట్టు పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు తెలిపారు. రోగులకు అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేవారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, సూపర్వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ చిన్నారి, ఏఎన్ఎం రోజా రాణి, ఆశావర్కర్లు లత, పద్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమునాల సేకరణతో రైతులకు మేలు



మట్టి నమునా సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: మట్టి నమునాల సేకరించి భూసార పరీక్షలు చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ శాఖాధిరి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. దోమాడ రైతు భరోసా కేంద్రం వద్ద మట్టి నమునాల సేకరణపై శనివారం వ్యవసాయ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ మట్టి నమునాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మట్టిని పరీక్షించిన తరువాత భూసారం, భూస్వభావం, సమస్యాత్మక భూములకు సంబంధించిన వివరాలను రైతులకు వివరించాలన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అనపర్తి రైల్వే స్టేషన్‌లో కరపత్రాలను పంచుతున్న అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి

అనపర్తి: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అనపర్తి అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక దేవీచౌక్, బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, అనపర్తి శివారు సావారం తదితర ప్రాంతాల ప్రజలకు అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించిన అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు కరపత్రాలను పంచుతూ మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఇళ్లలో గ్యాస్ ప్రమాదాలు సంభవించే తీరు, మంటలను అదుపుచేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై మహిళలకు అవగాహన కల్పించి వాటిని ప్రదర్శన ద్వారా వివరించారు.

జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శలు



కోటికేశవరంలో పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోటికేశవరంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శనివారం పరామర్శించారు. ఎంపీటీసీ నేతల లక్ష్మణరావు తల్లి మరియమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని, కె.వెంకటరమణ, దావీదు కుటుంబ సభ్యులకు ఆమె పరామర్శించి, సానుభూతిని తెలియజేశారు. ఆమె వెంట సర్పంచ్ ముడే సిందూదివ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు మేడే కామేష్, తదితరులు ఉన్నారు.

వ్యక్తికి గాయాలు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. బిక్కవోలు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం బలభద్రపురం శివారు వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతున్న వడ్డి రాజును కారు ఢీకొట్టింది. గాయపడిన అతడిని స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బుజ్జిబాబు తెలిపారు.

భూమికి సారం.. రైతుకి లాభం..

- పచ్చిరొట్టతో పుడమికి మేలు
- రసాయన ఎరువులు తగ్గించుకునేందుకు మార్గం



రంగంపేటలో సాగుచేస్తున్న పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే నేపియర్ గడ్డి

రంగంపేట: రసాయన ఎరువుల వాడకం ఏటికేడు విపరీతంగా పెరిగిపోతుంది. ఫలితంగా భూసారం క్షీణిస్తోంది. దీని ప్రభావం మళ్లీ తరువాత సాగుచేసే పంటలపై పడి దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో పొలంలో సారం పెంచుకునేందుకు రైతులు రబీ పంటల అనంతరం చేలల్లో పచ్చిరొట్ట పైరును పెంచడం ఎంతో మంచిదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

స్థూల పోషకాలు అధికం

గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పైరుల పెంపకం తగ్గిపోయింది. దీని వల్ల భూసారం తగ్గి పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన మందులు పిచికారి చేసి అనర్థాలను కొని తెచ్చుకుంటున్నారు. రబీకి, ఖరీఫ్‌కు మధ్యలో పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది.

జనుము, జీలుగ, పిల్లి పెసర, ఉలవ తదితర రకాలను రబీకి, ఖరీఫ్‌కు మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్ పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 శాతం నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి.

గుళికలతో నష్టం

ఖరీఫ్, రబీ పంటల్లో రైతులు గుళికలను అధికంగా వాడటం వల్ల భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్టు శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయినట్టు పరిశోధనల్లో తేలింది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వలన తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ఏడీఏ డీవీ కృష్ణ తెలిపారు. సహజంగా చౌడుబారిపోయిన భూముల్లో జీలుగు వేసుకుంటే భూమి భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది.



పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే జనుము

ఇదే సరైన సమయం

అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో ప్రస్తుతం రబీ కోతలు ముమ్మరంగా సాగుతున్నందున పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకునేందుకు ఇదే అదును.

పచ్చిరొట్ట ఎరువులు వేయాలి



రైతులు రబీ, ఖరీఫ్ సీజన్ల మధ్యలో పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు సాగుచేసుకోవాలి. దీని వల్ల భూసారం పెరిగి పంటలు అధిక దిగుబడులు రావడానికి ఆస్కారమేర్పడుతుంది. పంట కోసిన వెంటనే పదునుపై పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

– డీవీ కృష్ణ, ఏడీఏ, అనపర్తి

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- గరగలంపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం



గరగలంపాలెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శనివారం కోరకొండ మండలం గరగలంపాలెం, బొల్లెద్దుపాలెం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, వాటి ద్వారా పొంది లబ్ధిని తెలియజేశారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు.పథకాలు, అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనన్న అధికారంలోకి రావాలని, అందుకు ప్రజలందరూ ఆయన వెంట ఉండాలన్నారు. తొలుత గరగలంపాలెంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ 80 గడపలు తిరిగారు. తర్వాత బొల్లెద్దుపాలెంలో సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకూ 120 గడపలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గం పరిశీలకులు వి.రాజశేఖర్, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, గరగలం సర్పంచ్ బోడపాటి నాగలక్ష్మి, బొల్లెద్దుపాలెం సర్పంచ్ కురుమెళ్ల బుజ్జియ్య, ఎంపీటీసీ అల్లి సింహాచలం, వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అనపర్తి మండల పరిషత్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలు, ఆన్‌లైన్‌లో సాంకేతిక పరమైన సమస్యలు కారణంగా రైతులు ధాన్యం అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఖరీఫ్ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు ప్రస్తుత రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు గిట్టుబాటు ధర పొందేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలో కొన్ని గ్రామాల్లోని పొదుపు సంఘాల్లో యానిమేటర్లు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. దీనిపై అధికారులు లోతైన విచారణ నిర్వహించి సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కర్రి దాసు, మండల పరిషత్ విప్ సబ్బెళ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కరకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం



కరకుదురులో స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ మరింత పెరుగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడాలేని విధంగా గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు.

కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ అందరి మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని చెప్పారు.

ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో తెలుసుకోడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. పెదపూడి మండలాన్ని కాకినాడ జిల్లాలో కలపడానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విశేష కృషి చేశారని ప్రజలు అడుగడుగున నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ వుంద్రు చంద్రకళ, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్న బాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుంద్రు సత్యనారాయణ, పార్టీ మండల అధికార ప్రతినిధి వాసంశెట్టి మాధవ, మాజీ సర్పంచ్ సానా రాంబాబు, పార్టీ గ్రామ కన్వీనర్ పెమ్మనబోయిడి రాజు, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ పప్పు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుకు నిరసనగా 24న పాదయాత్ర



రంపయర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతుకూలీ సంఘం సభ్యులు

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలోని సుందరమ్మ సత్రానికి చెందిన 89 ఎకరాల భూమికి సంబంధించి ఎండోమెంట్ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 24న పాదయాత్ర నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు తెలిపారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్రం భూముల విషయంలో భూస్వాములకు, రాజకీయ నాయకులకు ఎండోమెంట్ శాఖ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనికి నిరసనగా 24న రంపయర్రంపాలెం నుంచి గోకవరం తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



చినకొండేపూడి ఆర్‌బీకే ధాన్యం తేమ కొలిచే యంత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ రాజు

సీతానగరం: మండలంలో ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్ సత్యనారాయణ రాజు కోరారు. ఎంపీడీఓ కె.రమేష్, ఏఓ కె.సూర్యరమేష్‌లతో కలిసి శనివారం ఆయన మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కాటవరం, చినకొండేపూడి-1, వంగలపూడి, కాటవరం, మిర్తిపాడు, రఘుదేవపురం-1, 3, నాగంపల్లి, పురుషోత్తపట్నంలలోని ఆర్‌బీకేల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం తేమ కొలిచే యంత్రం, ధాన్యం తూచే కాటాను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే వీఏఏలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు

రాజానగరం: రబీ వరి కోతలు ముమ్మురంగా సాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చర్యలు తీసుకుంటోందని తహసీల్దారు పవన్‌కుమార్ తెలిపారు. పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరకు విక్రయించాలనుకునే రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి, పూర్తి వివరాలు తెలసుకోవాలని సూచించారు. ప్రతి ఆర్‌బీకే వద్ద ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

గోకవరం: ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని గ్రామాల్లోని ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఎంపీడీఓ కేఎస్ఎస్ మూర్తితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. అలాగే వ్యవసాయశాఖ సిబ్బంది ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్య

రంగంపేట: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట గ్రామానికి చెందిన బలసాని వెంకటరమణ(50)ను ఈ నెల 4వ తేదీన సారా కేసులో ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం కోర్టు నుంచి బెయిల్‌పై విడుదలై అవమానంతో ఈనెల 14వ తేదీ శుక్రవారం గడ్డి మందు సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్‌ఐ తెలిపారు.

నగదు కాజేసిన వ్యక్తిపై కేసు

రంగంపేట: ఇళ్ల స్థలాలకు, ఇళ్ల నిర్మాణానికి బ్యాంకు నుంచి లోన్లు ఇప్పిస్తానని చెప్పి నగదు కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం జి.దొంతమూరుకు చెందిన చంద్రమల్ల ఏడుకొండలు అనే వ్యక్తి నుంచి చౌదరి అనే మరో వ్యక్తి బ్యాంకుల నుంచి లోన్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.62 వేలు కాజేసి మోసం చేసి పరారయ్యాడన్నారు. ఏడుకొండలతో పాటు మరికొంతమంది నుంచి కూడా నగదు కాజేసినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు చెప్పారు.


వ్యవసాయ సలహా మండలి సమావేశం



గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రబీ ధాన్యం కొనుగోలు చేస్తామని, ఇందు కోసం గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. పంట పొలాల్లో పోషక విలువలు పెంపొందించేందుకు మట్టి నమూనాల సేకరిస్తున్నట్టు చెప్పారు. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్సయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

అమ్మానాన్నలను అప్యాయంగా చూసుకోవాలి



ఆకెళ్ల శివప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం రూరల్: అమ్మానాన్నలను వృద్ధాప్యంలో అప్యాయంగా చూసుకోవాలని, అలాగే మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలని రంగమార్తాండ చలన చిత్ర మాటల రచయిత ఆకెళ్ల శివప్రసాద్ అన్నారు. శనివారం బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన 'తెలుగుభాషాసాహిత్యం-రంగమార్తాండుని సంభాషణ చాతుర్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఆకెళ్ల శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఎస్.ఆర్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రచయిత ఆకెళ్ల శివప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. అయ్ గోదారోళ్ల మండి పాట రచయిత సూజిళ్ల శ్రీనివాస్, అధ్యాపకులు కె.వి.సూర్యనారాయణ, గంగాధర్, బాలరాజు, వీరభద్రరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

'నన్నయ' సిబ్బందికి క్రీడా పోటీలు



క్యారంబోర్డు ఆడి పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరాజు

రాజానగరం: యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. శనివారం క్యారం బోర్డు ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో పని చేసే బోధన, బోధనేతర సిబ్బందికి వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పురుషులను క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, 800 మీటర్ల వాక్, షాట్‌పుట్, క్యారంబోర్డు వంటి పోటీలు, మహిళలకు 400 మీటర్లు వాక్, క్యారంబోర్డు, త్రోబాల్, బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్, షాట్‌పుట్ వంటి పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారంతా ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్స్ ఆచార్య పి.సురేష్‌వర్మ, డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.మట్టారెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.టేకి, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ డాక్టర్ కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన 'జగనన్నే మా భవిష్యత్తు'



మునికూడలిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



బూరుగుపూడిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: మునికూడలిలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్, గృహ సారధి అంబటి రాజు, పంచాయతీ వార్డు మెంబర్, గృహ సారధి అంబటి సుభాషిణిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరించారు. అనంతరం స్థానికుల అనుమతితో ఇంటి గోడ, సెల్‌ఫోన్లపై మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కవల దుర్గం, వలంటీర్లు అమల, రామకృష్ణ, రమ్య, శాంతి, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు

గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు

మధురపూడి: కోరుకొండ మండలంలోని కోరుకొండ, గాదరాడ, బూరుగుపూడిలో బాబూ జగజ్జీవన్‌రామ్‌పేట, అల్లూరి సీతారామరాజు కాలనీల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు కంటే వీరవెంకట సత్యనారాయణ, నేతుల చిన్ని, బొరుసు బద్రి, బుడ్డిగ సత్తిబాబు, మేకా నెహ్రూరాజు, ఏడిద పండు, కుందేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్

బిక్కవోలు: రాష్ట్ర అభివృద్ధి జగన్ చేతుల్లోనే ఉందని సర్పంచ్ పెద్దిరెడ్డి సత్య సాయిరామ్ అన్నారు. శనివారం మండలంలోని మోళ్లూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా సుపరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమ్మన ఆనంద్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.